క్లుప్తంగా


నిబంధనలు తప్పనిసరి



హాస్టల్స్ నిర్వాహకులు, యజమానులకు సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: మహిళల రక్షణ, భద్రత చర్యల్లో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పరిధిలోని ప్రైవేటు హాస్టల్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ యజమానులతో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం సమావేశం నిర్వహించారు. హాస్టల్స్‌లో ఉండే మహిళలకు రక్షణ కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, వాటి వీడియో ఫుటేజ్‌లు 30 రోజుల పాటు నిక్షిప్తమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బంధువుల పేరుతో విద్యార్థినుల కోసం వచ్చే వ్యక్తుల వివరాలు నమోదుచేయాలన్నారు. హాస్టల్స్, మేడలపై ప్రహరీల ఎత్తు పెంచాలని, ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ హరిబాబునాయుడు, హాస్టల్ నిర్వాహకులు, యజమానులు పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాల పరిశీలన



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

పూసపాటిరేగ: మండలంలోని కొత్తకొప్పెర్ల ప్రభుత్వ పాఠశాలలను ఆర్‌జేడీ విజయభాస్కర్ గురువారం సందర్శించి, అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నలు వేసి, పరిశీలించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, విద్యలో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని కోరారు. అంతకుముందు ప్రార్థనా సమయానికి హాజరుకాని ముగ్గురు ఉపాధ్యాయుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని సూచించారు. స్టూడెంట్ కిట్లు చూసి, సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలి



అంగన్‌వాడీ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శాంతికుమారి

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి బి.శాంతికుమారి గురువారం సందర్శించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని కార్యకర్తలు శకుంతల, చిన్నమ్మకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధిక, తహసీల్దార్ ప్రవల్లికప్రియా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గజపతినగరం: స్థానిక డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరాలనుకునే వారంతా ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ ఓ ప్రకటనలో గురువారం కోరారు. బీఎస్సీ సీబీజెడ్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఏ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న వారంతా కళాశాలలో చేరాలన్నారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వండి



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

గజపతినగరం: కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయ సిబ్బందిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల ప్రచార సమయంలో కౌలురైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ మాట నిలబెట్టుకోవాలని, అలాగే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సౌకర్యంక కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి

- మండల ప్రత్యేకాధికారిణి సుధారాణి



డెంకాడ: అక్కివరంలో ఆరోగ్య కేంద్రం సేవలపై సమీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



భోగాపురం: తూడెం ప్రాథమిక పాఠశాల సందర్శనలో మండల ప్రత్యేకాధికారిణి సుధారాణి

భోగాపురం: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారిణి సుధారాణి అధికారులను ఆదేశించారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని తూడెం గ్రామాన్ని ఆమె గురువారం సందర్శించి, ఆ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై మండల స్థాయి అధికారులు, గ్రామస్తులతో సమీక్షించారు. గ్రామంలోని సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి, అక్కడి సిబ్బంది పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. క్యాక్రమంలో సర్పంచ్ గాలి నరసయ్యమ్మ, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, ఎంపీడీవో చంద్రకళ, తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: గ్రామ సందర్శన కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. మండలంలోని అక్కివరం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించి, అక్కడి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులతో సమావేశమై, అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి, అక్కడ అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ఉద్యోగులు చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రజాసేవకులుగా మంచి గుర్తింపు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, ఎంపీడీవో లవరాజు, తహసీల్దార్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: గ్రామ సందర్శనలో గుర్తించిన ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, అక్కడి సమస్యలపై ఆరాతీశారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో కాలువల పరిస్థితి బాగాలేదని, రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తున్న విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఉన్నత పాఠశాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచరాపు సూర్యకళ, మాజీ సర్పంచ్‌లు రాము, తిరుపతిరావు, ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ఒకటో డివిజన్‌లో వీధి కాలువలు పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.ఎం.నాయుడు

- కమిషనర్ ఎం.ఎం.నాయుడు

విజయనగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని నగర ప్రజలకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు సూచించారు. ప్రతి గురువారం డివిజన్ పర్యటనలో భాగంగా ఒకటో డివిజన్ ప్రాంతంలో పర్యటించారు. లక్ష్మీగణపతి కాలనీలోని పరిసరాల స్థితిగతులను పరిశీలించారు. నిరుపయోగంగా పడి ఉన్న ఖాళీ స్థలాలల్లో చెత్తాచెదారాలు పేరుకుపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థ పదార్థాలు చేరడం గమనించి వాటిని ఎందుకు తొలగించలేదని పారిశుద్ధ్య కార్యదర్శులు, ప్రజారోగ్య సిబ్బందిని ప్రశ్నించారు. ప్రైవేటు స్థలాలు కావడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయని చెప్పడంతో తక్షణమే సంబంధిత స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వెంటనే తుప్పలను చెత్తాచెదారాలను పరిశుభ్రపరిచే విధంగా చొరవ తీసుకోవాలని చెప్పారు. లేకుంటే తామే అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రాంతాలను పరిశుభ్రపరిచి అందుకే అయ్యే ఖర్చులను స్థల యజమానుల నుంచి రాబడతామని తెలిపారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధింపును తప్పనిసరిగా పాటించాలని ప్రణాళికా కార్యదర్శులకు ఆదేశించారు. ఆయా ప్రాంతాలలో కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో పూడికలు తొలగించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, ఎంఈఓ, డీఈ, ఏఈలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఈఆర్ఎస్‌యూ



విజయనగరం రైల్వేస్టేషన్ అధికారులతో శ్రామిక్ యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: అర్బన్ బ్యాంకు ఉద్యోగులకు అండగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ (ఈఆర్ఎస్‌యూ) కృషిచేస్తోందని కమర్షియల్ బ్రాంచ్ నుంచి పోటీచేస్తున్న జి.అచ్యుతాంబ, జి.ఎస్.చెట్టి, గణేష్‌తాపాలు తెలిపారు. వాల్తేర్ డివిజన్ రైల్వే అర్బన్ బ్యాంక్ పరిధిలోని 84 మంది డెలిగేట్స్‌ను ఎంపిక చేసేందుకు ఈ నెల 24, 25 తేదీల్లో ఎన్నికలు జరగనున్నవి. ఈ మేరకు శ్రామిక్ యూనియన్ కమర్షియల్ బ్రాంచ్ ప్రతినిధులు విజయనగరం రైల్వేస్టేషన్‌లోని ఉద్యోగులను గురువారం కలిశారు. రైల్వే ఉద్యోగులకు మినిమమ్ లోన్, సేమ్ డే లోన్, రక్షణ, 50 శాతం సీఎమ్‌టీడీ విత్‌డ్రా, ఏటీఎం కార్డ్, ఎడ్యుకేషన్ లోన్, డెత్ ఫండ్స్, ఎక్స్‌టెన్షన్ కౌంటర్లు వంటి కమిట్‌మెంట్స్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. ఉద్యోగులందరూ తమ అభ్యర్థిత్వాలను ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక్ యూనియన్ జోనల్ సెక్రటరీ దామోదరరావు, సెంట్రల్ ఆఫీస్ ప్రతినిధి యు.ఎల్.నాగరాణి, కమర్షియల్ బ్రాంచ్ సెక్రటరీ పి.చంద్రశేఖర్, కె.శ్రీను పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడండి



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డలను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ

పూసపాటిరేగ: పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో గర్భిణుల సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు కనిమెట్టకు చెందిన పుష్ప, పేరాపురానికి చెందిన జానకి, పూసపాటిరేగకు చెందిన సంధ్య, కోనాడకు చెందిన గౌరి, పూసపాటిపాలెం గ్రామానికి చెందిన వరలక్ష్మి గురువారం పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా బాలింతలు, పుట్టిన బిడ్డల ఆరోగ్యాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకేరోజు ఐదు ప్రసవాలు జరగడం ఇదే ప్రథమమని, ఆయా గర్భిణుల సుఖప్రసవానికి చర్యలు తీసుకున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రమీలాదేవి, సిబ్బంది ఆర్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే 181కు ఫోన్ చేయండి

- వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి, కేస్ వర్కర్ అనిత

విజయనగరం ఫోర్ట్ : పని ప్రదేశాల్లో మహిళల పట్ల ఎవరైనా వేధింపులకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి, కేస్ వర్కర్ అనిత అన్నారు. పట్టణంలోని స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, తదితర ప్రదేశాల్లో మహిళలను ఎవరైనా వేధిస్తే లైంగిక వేధింపుల చట్టం కింద కఠిన శిక్షలు తప్పవన్నారు.

బిందుసేద్యంతో సాగునీరు ఆదా



డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

వేపాడ: బిందు, తుంపరసేద్యంతో సాగునీరు ఆదా అవుతుందని, ప్రతీ రైతు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బిందు, తుంపర సేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని వల్లంపూడి గ్రామంలో పరమేశ్వరి అనే వ్యక్తికి రాయితీపై ఇచ్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆ పరికరాలను వినియోగిస్తూ పండ్లు, కూరగాయలు సాగు చేయడాన్ని అభినందించి, ప్రోత్సహించారు. చిన్న, సన్నకారు రైతులంతా డ్రిప్ ఇరిగేషన్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రమేష్ పాల్గొన్నారు.

నేడు ఆశీల వేలంపాట

కొత్తవలస: స్థానిక సంతమార్కెట్ రోజువారీ ఆశీలకు సంబంధించి, వేలంపాటను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణయ్య ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.50 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

ప్రకటనలకే పరిమితం కావొద్దు




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య

విజయనగరం పూల్‌బాగ్: ప్రకటనలకే పరిమితం కాకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. గురువారం స్థానిక అమరభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొద్ది రోజుల కిందట విజయనగరం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తా అని ప్రకటన చేశారన్నారు. గతంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మీరు ఉత్తరాంధ్రకు చేసిందేమీ లేదు.. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రకటనలు కాకుండా చేతల రూపంలో అభివృద్ధి చేసి చూపించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేస్తే శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే పారిశ్రామిక అవసరాలకు 400 టీఎంసీల నీరు వాడుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. జంజావతి ప్రాజెక్ట్ అటు ఒడిశా, ఇటు ఆంధ్ర మధ్య పెండింగ్‌లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి .జాన్సన్‌బాబు, సీపీఐ కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎన్. నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే శిక్ష తప్పదు



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకళ్యాణి

విజయనగరం టౌన్: బాలికలు, మహిళలపై అనుచితంగా ప్రవర్తించినా, లైంగికంగా వేధించినా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా శిక్షలు కఠినంగా ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకళ్యాణి హెచ్చరించారు. విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు ఎల్లవేళలా ధైర్యంతో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నల్సాస్కీమ్ కింద బాధిత మహిళలకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. కళాశాలలో వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీకేవీ కృష్ణారావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండకరకాంలో గ్రామసందర్శన



సచివాలయంలో నిర్వహిస్తున్న గ్రామసభ

విజయనగరం రూరల్: కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు మండలంలోని కొండకరకాంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో పలువురు అధికారులు గ్రామంలో పర్యటించి జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలపై చర్చించారు. గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రీన్ అంబాసీడర్లు తమ జీతాలు పెంచాలని అధికారులకు వినతి పత్రం అందించారు. అలాగే ఆర్‌కే టౌన్‌షిప్ సమీపంలో ఉన్న చెరువులో అక్రమంగా చర్చి నిర్మిస్తున్నారని ఫిర్యాదు రాగా.. తహసీల్దార్ పీవీ రత్నం, అధికారులు వెళ్లి పరిశీలించి నిర్మాణం ఆపాలని నిర్వాహకులకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, సర్పంచ్ రమ్య, ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న హీల్ ప్రాజెక్టు ప్రతినిధి తాలాడ దీప్తి, తదితరులు

విజయనగరం టౌన్: కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని లెప్రసీమిషన్, హీల్ ప్రాజెక్టు ప్రతినిధి తాలాడ దీప్తి అన్నారు. చెల్లూరులో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, అరచేతులు, పాదాలు, నరాల్లో తిమ్మిర్లు, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం తదితర లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కుష్టురహిత జిల్లాగా మార్చేందుకు ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపడతామన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కుష్టువ్యాధికి చికిత్సతో పాటు మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సీడీఓ వంశీ పాల్గొన్నారు.

• పనిలేక ఇంటిబాట



కోట ప్రాంతంలో పనికల్పించేవారి కోసం నిరీక్షిస్తున్న భవన నిర్మాణ కార్మికులు





భోజన క్యారేజీలతో పని కల్పించేవారి కోసం ఎదురుచూపు



పనిలేకపోవడంతో తిరిగి వెళ్లిపోతున్న కూలీలు



దిగాలుగా వెళుతూ...

ఎండైనా.. వానైనా ప్రతిరోజు పనికోసం వెతుకులాట వారిది. పని దొరికితేనే బతుకు నావ ముందుకు సాగుతుంది. చిరుజల్లులు కురువడం, వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పనులు నిలిచిపోవడంతో పనిచెప్పేవారే లేకపోయారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లలో గురువారం గంటల తరబడి నిరీక్షించిన భవన నిర్మాణ కార్మికులు చివరకు ఇంటిబాట పట్టారు. దీనికి ఈ చిత్రాలే సజీవసాక్ష్యం.

– సాక్షిఫొటో గ్రాఫర్, విజయనగరం